క్లుప్తంగా

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: జిల్లా ఇన్‌చార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని సోమవారం అనంతపురంలో ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, శింగనమల వైఎస్సార్‌సీపీ నాయకులు కలిశారు. రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బోయ ఎస్వీ నారాయణ, ఎస్టీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే రామకృష్ణ, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరెడ్డి తదితరులు మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. పార్టీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులుగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యల్లనూరు జెడ్పీటీసీ భోగాతి ప్రతాప్‌రెడ్డి, నియోజకవర్గ నాయకలు పాల్గొన్నారు.

నేడు పి.ఎర్రగుడిలో జాతర

గుత్తి రూరల్: మండలంలోని పి.ఎర్రగుడి గ్రామంలో మంగళవారం జరిగే పెద్దమ్మ ఊరు జాతరకు ముమ్మరంగా ఏర్పాట్లు చేపట్టారు. సోమవారం గ్రామంలో పారిశుద్ధ్య పనులు, పిచ్చి మొక్కల తొలగింపు, ప్రధాన రోడ్లను సర్పంచ్ మోటా పాపన్న శుభ్రం చేయించారు. గ్రామంలో జరిగే ఊరు జాతరకు ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి రానుండటంతో పెద్ద ఎత్తున పారిశుద్ధ్య పనులు చేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను జేసీబీ సహాయంతో తొలగించారు. అలాగే గ్రామంలో వీధిలైట్లు వేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మసూద్‌వలి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రీడాకారులకు సూచనలిస్తున్న దృశ్యం

తాడిపత్రి టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో పాఠశాలల క్రికెట్ టోర్నమెంట్‌ను ఆర్డీటీ ఏటీఎల్ రామాంజనేయులు, చుక్కలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీఈటీ రాజు ప్రారంభించారు. నియోజకవర్గంలోని 12 పాఠశాలలకు చెందిన క్రికెట్ జట్లు పోటీల్లో పాల్గొంటున్నట్లు సీనియర్ కోచ్ సాధిక్ వలి, కోచ్ భార్గవ్ తెలిపారు.

నేటి నుంచి చెన్నకేశవుడి బ్రహ్మోత్సవాలు

యాడికి: మండల కేంద్రంలో వెలసిన శివలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందు కోసం ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా ఫాల్గుణ మాసంలో అష్టమి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమై.. 11 రోజుల పాటు రోజుకొక అవతారంతో స్వామి భక్తులకు దర్శనమిస్తారు.

నేడు అంకురార్పణ

28న అంకురార్పణ, కలశ స్థాపనతో ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాల్లో మార్చి 1వ తేదీ ఉదయం ధ్వజారోహణం, 2న నరసింహ వాహనం, 3న శేషవాహనం, 4న ఆంజనేయ స్వామి వాహనం, 5న గరుడోత్సవ వాహనం, 6న గజేంద్రోత్సవం, 7న కల్యాణోత్సవం, రథోత్సవం, 8న అశ్వ వాహనం, 9న హంస వాహనం, 10న శయనోత్సవం నిర్వహించనున్నారు. ఉత్సవాల సందర్భంగా కబడ్డీ, రాతి గుండు, ఇరుసు పోటీలు, పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కార్యనిర్వహణ అధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు.

10 వరకూ బ్రహోత్సవాలు..

ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో శివ లక్ష్మీ చెన్నకేశ స్వామి బ్రహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, ఉప సర్పంచ్ కాసా చంద్ర మోహన్, సీనియర్ నాయకుడు బాలా రమేష్ బాబు తెలిపారు. మంగళవారం నుంచి మార్చి 10వ తేదీ వరకూ బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు.

ఉపకరణాల పంపిణీ

పెద్దవప్పూరు: సమగ్ర శిక్ష ద్వారా విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం సరఫరా చేసిన చక్రాల కుర్చీలు, వినికిడి యంత్రాలు, రోలేటర్స్ ఉపకరణాలను సోమవారం స్థానిక ఎంఈఓ కార్యాయలంలో ఎంఈఓ శ్రీదేవి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ బాల పెద్దక్క పాల్గొన్నారు.

నీటి సమస్య రాకుండా చూడాలి

గుత్తి రూరల్: వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని రాయలసీమ విమోచన సమితి జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి అధికారులను కోరారు. సోమవారం బసినేపల్లిలో రాయలసీమ విమోచన సమితి నాయకులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పనులు త్వరగా పూర్తి చేసి, ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న పైప్‌లైన్‌ను సత్య సాయిబాబా ప్రాజెక్టుకు అనుసంధానం చేసి నీటి సమస్య రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌వీఎస్ నాయకులు కాశీరావు, జ్ఞానేశ్వరరెడ్డి, గురుశంకర్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజాసంక్షేమ పాదయాత్ర

- ముచ్చుకోటలో ప్రారంభం



ముచ్చుకోట రిజర్వాయర్ వద్ద గంగపూజ చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి (ఫైల్)

పెద్దపప్పూరు: తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మండలంలోని ముచ్చుకోట నుంచి మంగళవారం ప్రజాసంక్షేమ పాదయాత్రకు శ్రీకారం చుట్టనున్నారు. చుక్కనీరు లేక దిష్టిబొమ్మల్లా ఉన్న ముచ్చుకోట, చాగల్లు, పెండేకల్లు ప్రాజెక్టులకు అధికారం చేపట్టిన తరువాత ఎమ్మెల్యే పెద్దారెడ్డి నీరు విడుదల చేయించారు. తాగు, సాగునీటి కొరత లేకుండా ఇచ్చిన మాటను నెరవేర్చిన ఘనత ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికే దక్కుతుంది. తొలిసారి పాదయాత్రకు శ్రీకారం చుట్టడంతో ఘన స్వాగతం పలకడానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, మండల ప్రజలు భారీ ఏర్పాట్లు చేశారు. గత పాలకుల 40 ఏళ్ల పాలనలో మండలాన్ని పట్టించుకున్న పాపాన పోలేదు. ముచ్చుకోట ప్రాజెక్టుకు నీరు విడుదల చేయాలని ఎన్నికల సమయంలో జేసీ సోదరులను అడిగినా పట్టించుకోలేదు. 2019 ఎన్నికల ప్రచారంలో భాగంగా తాడిపత్రికి విచ్చేసిన అప్పటి ప్రతిపక్ష నాయకుడు, ప్రస్తుత సీఎం జగన్మోహన్ రెడ్డి ఈప్రాంత ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. చాగల్లు, ముచ్చుకోట, పెండేకల్లు రిజర్వాయర్లకు నీరు విడుదల చేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీని నెరవేర్చడంతో మండల వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పెరిగిపోయింది. ఇదిలా ఉండగా మరోవైపు కుల, మత, రాజకీయ పార్టీలనే భేదాలు లేకుండా ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారు. కాగా.. సంక్షేమ పాదయాత్రలో పలు గ్రామాలకు చెందిన జేసీ వర్గీయులు టీడీపీకి స్వస్తి చెప్పి.. వైఎస్సార్‌సీపీలో చేరేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తొలిరోజు పాదయాత్ర ముచ్చుకోటలో ప్రారంభం కానుంది. వరదాయపల్లి, అమ్మలదిన్నె కొత్తపల్లి వరకూ సాగుతుంది. ఎమ్మెల్యే పెద్దారెడ్డి కొత్తపల్లిలో మంగళవారం రాత్రి బస చేస్తారు. అక్కడి నుంచి బుధవారం నారాపురం, సోమనపల్లి, తిమ్మనచెరువు, జూటూరు గ్రామం వరకూ పాదయాత్ర సాగుతుంది.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

గుంతకల్లుటౌన్: మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో మంగళవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్, కో–ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు హాజరుకావాలని సూచించారు.

2న గార్లదిన్నెలో..

గార్లదిన్నె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మార్చి 2న ఎంపీపీ వెంకటనారాయణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయభాస్కర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ శాఖలపై సమీక్ష ఉంటుందన్నారు. వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ, గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు సమావేశంలో పాల్గొనాలన్నారు.

5 నుంచి తిక్కస్వామి ఉరుసు



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు: మండల పరిధిలోని కసాపురం సమీపంలోని తిక్కస్వామి దర్గా 98వ ఉరుసు ఉత్సవాల పోస్టర్లను సోమవారం ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి విడుదల చేశారు. మార్చి 5, 6, 7 తేదీల్లో మూడు రోజుల పాటు ఉరుసు ఉత్సవాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో కసాపురం వైఎస్సార్‌సీపీ నాయకులు సోమిరెడ్డి, మాజీ సర్పంచ్ తిక్కస్వామి, గంతుల రామాంజినేయులు, జిలకర మోహన్, వినోద్‌కుమార్ రెడ్డి, మనోహర్, రాము తదితరులు పాల్గొన్నారు.

దేవరలో పాల్గొన్న ఎమ్మెల్యే..

గుత్తి రూరల్: మండలంలోని పీ యర్రగుడి గ్రామంలో సోమవారం నిర్వహించిన ఊరి దేవరలో ఎమ్మెల్యే వై వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో గుత్తి ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, సర్పంచ్ పాపన్న, గోవర్ధన్ రెడ్డి, నాయకులు విశ్వనాథరెడ్డి, శంకర్ రెడ్డి, నగేష్, దేవ, రాము, రంగారెడ్డి, మల్లయ్య యాదవ్ పాల్గొన్నారు.

చిరు ధాన్యాల సాగు లాభదాయకం



మాట్లాడుతున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి

బుక్కరాయసముద్రం: చిరు ధాన్యాల సాగు లాభదాయకంగా ఉంటుందని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధిలో ప్రత్యక్ష ప్రసారంలో భాగంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి మాట్లాడుతూ.. తక్కువ పెట్టుబడి, తక్కువ నీటితో చిరు ధాన్యాల పంటలను సాగు చేయవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భార్గవి మాట్లాడుతూ.. రైతులు వర్మి కంపోస్ట్ ఎరువులు వాడాలన్నారు. వర్మి కంపోస్ట్ తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ శశికళ,డాక్టర్ కిషోర్‌రెడ్డి, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త సుధారాణి, డాక్టర్ మాధవి పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



మాట్లాడుతున్న డీడీహెచ్ రఘునాథ్‌రెడ్డి

పామిడి: సమగ్ర సస్యరక్షణ యాజమాన్య పద్ధతులతో పండ్ల తోటల్లో అధిక దిగుబడి సాధించవచ్చని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని పాళ్యంతండాలో డాక్టర్ వైఎస్సార్ తోటబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చీనీలో ట్రైకోడెర్మావిరిడీ, పశువుల ఎరువు వాడకం వల్ల సాధించే అధిక దిగుబడులపై వివరించారు. రంగాపూర్ అంట్లను ఎక్కువగా నాటకోవాలని సూచించారు. అలాగే ఎద్దులపల్లిలో టమాట పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ నరసింహారావు, హార్టికల్చర్ ఆఫీసర్ మిత్రమింద మాధవి, పాళ్యం తండా సర్పంచ్ ఆర్ వెంకటేశ్ నాయక్, రైతులు రామకృష్ణానాయక్, సుధాకర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.


టెంకాయల విక్రయానికి వేలం

యాడికి: స్థానిక చెన్నకేశవ స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానుండటంతో సోమవారం టెంకాయల విక్రయానికి వేలం పాట నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఆలయ ఈఓ దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన టెంకాయల వేలం పాటలో నరేష్ కుమార్ రెడ్డి రూ.2.73 లక్షలకు విక్రయ హక్కులను దక్కించుకున్నారు. అనంతరం ఆలయ హుండీ కానుకలను లెక్కించగా.. రూ.1.80 లక్షల ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో యాడికి ఉప సర్పంచ్ కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు వెంకటనాయుడు, రామ్మోహన్, నాగరాజు, ఆలయ ధర్మకర్త రామిరెడ్డి, ఆలయ అర్చకుడు హరికృష్ణ శర్మ పాల్గొన్నారు.

భూమి ఆక్రమించారని ఫిర్యాదు

యల్లనూరు: తిరుమలాపురం గ్రామానికి చెందిన నారాయణరెడ్డి గ్రామ కంఠం ఆక్రమించాడని సర్పంచ్ రామాంజులరెడ్డి అన్నారు. సోమవారం గ్రామస్తులతో కలిసి తహసీల్దారు రమాదేవికి సోమవారం వినతి పత్రం అందజేశారు. సర్వే నంబర్ 95లో ఐదెకరాల గ్రామ కంఠం ఉండగా.. 2 ఎకరాల భూమిని నారాయణరెడ్డి ఆక్రమించాడని ఫిర్యాదు చేశారు. ఎస్సీ శ్మశాన వాటిక దారిని ఆక్రమించాడన్నారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రామలింగేశ్వరరెడ్డి, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



మృతుడి భార్యకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని చెర్లోపల్లి (23వ వార్డు)కు చెందిన షేక్ ఖాజా ఇటీవల మృతి చెందాడు. వైఎస్సార్ బీమా పథకం ద్వారా రూ.10 వేల తక్షణ సాయాన్ని సోమవారం మృతుడి భార్య రజియాకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పీరా, షఫీ, సచివాలయ వెల్ఫేర్ సెక్రెటరీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

యల్లనూరు: మండలంలోని చింతకాయమంద గ్రామానికి చెందిన ఓ యువతి ఆదివారం మధ్యాహ్నం అదృశ్యమైంది. తిమ్మంపల్లి గ్రామంలో షిర్డీసాయి బాబా ఆలయం వద్దకు వెళ్తున్నట్లు చెప్పిన సదరు యువతి ఇంటికి వెళ్లలేదు. ఈ మేరకు కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

వెన్నపూసకు మద్దతుగా ప్రచారం



మాట్లాడుతున్న గుంతకల్లు నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు రామలింగప్ప

తాడిపత్రి టౌన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక ఓట్లతో గెలిపించాలని కోరుతూ సోమవారం పట్టణంలోని కేవీరెడ్డి నగర్, అంబాభవానీ వీధి, పుట్లూరు రోడ్డు, శాస్త్రినగర్, కాల్వగడ్డ వీధుల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మట్టిపల్లి వేణుగోపాల్‌రెడ్డి (వేణు), రామచంద్ర, బాలచంద్ర, నగేష్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం

గుంతకల్లుటౌన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల స్థానానికి వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవానీ ఓటర్లను అభ్యర్థించారు. 27, 28, 29, 30, 31, 32 వార్డులకు ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా నియమితులైన ఆమె సోమవారం 28వ వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. గడిచిన మూడున్నరేళ్ల పాలనలో జగనన్న అమలుచేసిన సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ క్యాలెండర్ ప్రకారం ప్రతినెలా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత జగనన్న ప్రభుత్వానిదేనని వివరించారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రవీంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి జగనన్నకు గిఫ్ట్‌గా ఇవ్వాలని ఓటర్లను కోరారు.

పామిడి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో ఉన్న వెన్నపూస రవీంద్రరెడ్డి విజయమే పరమావధిగా ప్రతి ఒక్కరూ పని చేయాలని నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు రామలింగప్ప కోరారు. సోమవారం స్థానిక అనిమిరెడ్డి ఫ్యాక్టరీలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాలను గ్రామాల వారీగా పార్టీ శ్రేణులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్ అనిమిరెడ్డి, ఆర్‌సీ వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి సోదరుడు వెన్నపూస రమాకాంత్‌రెడ్డి, మండల సచివాలయ టౌన్ కన్వీనర్ బీ అసిఫ్, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు మూలి నాగేశ్వర్‌రెడ్డి, వెంకటసాయి గుప్తా, హరినాథ్‌రెడ్డి, సర్పంచ్‌లు డీసీ ముత్యాల్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బయపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాడికి: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్ సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించుకుందామని ఎన్నికల కో–ఆర్డినేటర్ చెన్నకేశవ రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని రాయలచెరువు, చందన, కేశవరాయుడి పేట, లక్షుంపల్లె గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టభద్రుల స్థానం నుంచి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయుల స్థానం నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా రామచంద్రారెడ్డికి మద్దతు ఇచ్చి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ శివ ప్రసాద్ పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

గుంతకల్లు: మండల పరిధిలోని బుగ్గసంగాల వద్ద వెలిసిన బుగ్గ సంగమేశ్వరుడి హుండీ కానుకలను సోమవారం అధికారులు లెక్కించారు. ప్రధాన హుండీ ద్వారా రూ.80,884, అన్నదాన హుండీ ద్వారా రూ.6,040 వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో ఉరవకొండ ఎండోమెంట్ శాఖ అధికారి రమాతులసి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నూతన గృహాల ప్రారంభోత్సవం



మాట్లాడుతున్న ఆర్డీటీ సిబ్బంది

యాడికి: మండలంలోని కమలపాడు గ్రామంలో సోమవారం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఆధ్వర్యంలో నిర్మించిన నూతన గృహాలను ఫ్రాన్స్ దేశస్తులు ప్రారంభించారు. ఆర్డీటీ తాడిపత్రి ఏటీఎల్ రామాంజనేయులు మాట్లాడుతూ.. గ్రామంలో ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్న పేద వారిని గుర్తించి ఒక్కో ఇంటికి రూ.2.65 లక్షల చొప్పున వెచ్చించి, 25 గృహాలను సర్వాంగ సుందరంగా నిర్మించారన్నారు. ఫ్రాన్స్ దేశస్తులు తమ సొంత డబ్బులతో ఇక్కడ గృహాలను నిర్మించడం సంతోషంగా ఉందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిత



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ నాగరాజు

తాడిపత్రి టౌన్: క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని ఎంఈఓ నాగరాజు విద్యార్థులకు సూచించారు. జనవరి 8వ తేదీన జరిగిన సైనిక్ స్కూలు ప్రవేశ పరీక్ష ఫలితాల్లో స్థానిక కృష్ణాపురం 6వ రోడ్డులోని మౌర్య స్కూలుకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనపరచి సైనిక స్కూలుకు ఎంపికయ్యారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సైనిక స్కూలుకు ఎంపికైన చెన్నకేశవరెడ్డి, భువనేశ్వర్ చౌదరి, యశ్వంత్ నాయక్, జష్వికారెడ్డి, హనేశ్వర్, సంతోష్‌కుమార్, వెంకట దిలీప్, పాఠశాల కరస్పాండెంట్ ఆంజనేయులును అభినందించారు.

ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా సిద్ధం



14వ వార్డు ఓటర్ జాబితాను విడుదల చేస్తున్న మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా

గార్లదిన్నె: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండల ఓటర్లు జాబితా తయారు చేసినట్లు తహసీల్దార్ ఉషారాణి సోమవారం పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా పట్టభద్రులకు సంబంధించి 1409 మంది ఓటర్లు, ఉపాధ్యాయులకు సంబంధించి 43 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. జాబితా ఎమ్మెల్సీ ఎన్నికల కోసం సిద్ధంగా ఉందన్నారు. గార్లదిన్నె జిల్లాపరిషత్ హైస్కూల్‌లో పట్టభద్రులకు సంబంధించి 2 పోలింగ్ స్టేషన్లు, ఉపాధ్యాయులకు సంబంధించి 1 పోలింగ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఓటరు జాబితా తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వద్ద అందుబాటులో ఉందన్నారు. కార్యాలయం పని వేళల్లో ఓటరు జాబితాలో పేర్లు సరిచూచుకోవచ్చన్నారు.

ఓటరు జాబితా విడుదల

తాడిపత్రి టౌన్: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో పట్టణంలోని 14వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ భాస్కర్ రెడ్డి మృతి కారణంగా ఏర్పడిన ఖాళీ స్థానానికి ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఓటర్ జాబితను సోమవారం మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా విడుదల చేశారు. మొత్తం ఓటర్లు 2,524 మంది ఉండగా అందులో 1,278 మంది పురుషులు, 1,246 మంది మహిళలు ఉన్నారు. కార్యక్రమంలో టీపీఎస్ మహబూబ్‌బాషా, సీనియర్ అసిస్టెంట్స్ చాంద్ బాషా, నాగరాజు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న చెన్నకేశవులు

గుంతకల్లు: స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ చేయడం నేరమని, అలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని లింగనిర్ధారణ ప్రోగామ్ అధికారి డాక్టర్ చెన్నకేశవులు హెచ్చరించారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో లింగ నిర్ధారణ, పీసీ, పీఎన్‌డీటీ చట్టలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ సెంటర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. డాక్టర్ల సిఫారసు లేకుండా గర్భస్రావం జరిగే మందులు అమ్మినా నేరమన్నారు. ఆడపిల్లల సంరక్షణ, లింగ నిర్ధారణ చట్టాలపై గ్రామ, మండల స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు హరిప్రసాద్, సుజాత, నవీన్‌బాబు, డిప్యూటీ డెమో త్యాగరాజు, హెల్త్ ఎడ్యుకేటర్లు, ఎన్‌జీఓలు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

గుత్తి: పట్టణంలోని కోట ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సుబహాన్, సీనియర్ ఉపాధ్యాయులు శామ్యూల్, ప్రతాప్, రఘు, పులికొండ, చంద్రకళ, నాగమణి, శేషాద్రి, శ్రీనివాసరెడ్డి, ఎస్తర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

‘అనుబంధ’ అధ్యక్షులకు సన్మానం



మంత్రి పెద్దిరెడ్డి నుంచి సన్మానం అందుకుంటున్న పార్టీ ఐటీ సెల్ జిల్లా అధ్యక్షుడు సందీప్ రెడ్డి



రంగనాథరెడ్డి (వికలాంగుల విభాగం)



నారాయణ (రైతు విభాగం)



రామకృష్ణ (ఎస్టీ సెల్)



ఈశ్వరెడ్డి (పబ్లిసిటీ వింగ్)

వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షుల పరిచయ కార్యక్రమం సోమవారం అనంతపురం గుత్తిరోడ్డులోని కేటీఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై.. అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులను సన్మానించారు.

– అనంతపురం సప్తగిరి సర్కిల్:

పురాతన కందకం పరిశీలన

గుత్తి: పట్టణంలోని కోట వీధి ముఖ ద్వారం వద్ద ఉన్న అతి పురాతన (బావి) కందకాన్ని సోమవారం రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పరిశీలించారు. కందకంలో పేరుకుపోయిన కంపచెట్లు, పూడికను తీసి, కందకం చుట్టూ కంచెను నిర్మించాలని పురావస్తుశాఖ అధికారికి ఫోన్‌లో సూచించారు. కందకంలో నీరు ఉంటే చుట్టు పక్కల బోర్లలో సమృద్ధిగా నీరు ఉంటుందని గుత్తి కోట సంరక్షణ సమితి సభ్యులు అధికారులకు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ బాషా, మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్ పాల్గొన్నారు.

హిజ్రాలపై దాడులను అరికట్టాలి

బుక్కరాయసముద్రం: తమపై జరుగుతున్న దాడులను అరికట్టాలని పలువురు హిజ్రాలు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. కొంత మంది నకిలీ హిజ్రాలు దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు రక్షణ కల్పించాలని హిజ్రాల సంఘం ప్రతినిధులు ఎస్ఐ శివ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.

ఎన్నికలు ముగిసే వరకూ ‘స్పందన’ రద్దు

శింగనమల: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని తహసీల్దార్ ఈశ్వరమ్మ తెలిపారు.